


దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 01 సంచిక : 336 సోమవారం 2-12-2024 | ఎడిటర్ : వేముల అయోధ్య రాములు | పేజీలు : 4 | వెల : 5 రూ/..

# రైతు భరోసా.. సంక్రాంతి తర్వాత

- అసెంబ్లీలో చర్చించి విధివిధానాల ఖరారు
- మారీచులు చెప్పే అబద్ధాలను నమ్మొద్దు
- కిషన్‌రెడ్డి.. హామీలపై ప్రత్యేకంగా చర్చిద్దాం
- మోదీ చేసిందీ.. మేం చేసిందీ తేలుద్దాం
- ఈ ప్రభుత్వం ఇంకా తొమ్మిదేళ్లు ఉంటుంది
- ఎన్నో విజయాలు సాధిస్తుంది: సీఎం రేవంత్



**తొలి సమయం హైదరాబాద్, డిసెంబరు 1:** అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర రైతాంగానికి రైతు భరోసా పథకాన్ని అందించి తీరతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎలాంటి సందేహాలు అవసరం లేదన్నారు. సంక్రాంతి తర్వాత రైతుల ఖాతాల్లో భరోసా సొమ్మును జమ చేస్తామని తెలిపారు. ఈ పథకం అమలుకు సంబంధించి విధివిధానాలను ఖరారు చేసేందుకు ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించామని గుర్తు చేశారు. ఉపసంఘం చేసే సూచనలపై ఈ నెలలో నిర్వహించే శాసనసభ సమావేశాల్లో చర్చించి, విదివిధానాలను ఖరారు చేస్తామన్నారు. సోనియాగాంధీ గ్యారెంటీగా చెబుతున్నానని, ఈ విషయంలో ఏ మారీచులు వచ్చి అబద్ధాలు చెప్పినా నమ్మవద్దని అన్నారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఎం మాట్లాడారు.

రైతుభరోసా పథకంపై ఆరోపణలు చేస్తున్న ప్రతిపక్షాలను మారీచులు, రాక్షసులతో పోల్చారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నవంబరు 28 నుంచి 30 వరకు నిర్వహించిన రైతు అవగాహన సదస్సుకు మంచి ఆదరణ వచ్చిందన్నారు. రైతుల ఆశీర్వాదం, సంపూర్ణ మద్దతుతో ఈ ప్రభుత్వం ఇంకా తొమిదేళ్లు ఎన్నో విజయాలు సాధిస్తుందని తనకు సంపూర్ణ విశ్వాసం కలిగిందన్నారు.

**రూ.7లక్షల కోట్ల అప్పు ఉన్నా.. రుణమాఫీ**

"తెలంగాణ ఏర్పడే నాటికి ఆనాడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో, రూ.69 వేల కోట్ల అప్పులతో కేసీఆర్‌కు రాష్ట్రాన్ని అప్పగించింది. అలాంటి రాష్ట్రాన్ని 2023 డిసెంబరులో కాంగ్రెస్ మళ్లీ అధికారం చేపట్టే నాటికి రూ.7 లక్షల కోట్ల అప్పు, ప్రతినెలా వడ్డీలు, అసలు కలిపి రూ.6,500 కోట్లు చెల్లించాల్సిన పరిస్థితికి తీసుకువచ్చారు." అని సీఎం రేవంత్ అన్నారు. ప్రజలపై అప్పుల భారం మోపలేదని, అద్భుతమైన పరిపాలనను అందిస్తున్నామని, రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చామని అప్పటి ప్రభుత్వం సందర్భం వచ్చినప్పుడల్లా దాడులు చేసిందని ఆరోపించారు. అందుకే తాము అధికారం చేపట్టిన తరువాత ఆస్తులు, అప్పులు, విద్యుత్, సాగునీటి ప్రాజెక్టులపై వాస్తవ పరిస్థితులను ప్రజలకు వివరించేందుకు శ్వేతపత్రం విడుదల చేశామని తెలిపారు. అప్పులను చూసి అ?ధైర్యపడకుండా.. ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేస్తున్నామని చెప్పారు.

**అన్ని పథకాలను తెచ్చింది కాంగ్రెస్సే..**

రైతులకు హరిత విప్లవం, సాగునీరు, ఉచిత విద్యుత్, రాయితీతో ఎరువులు, పండిన పంటలకు సబ్సిడీ, ఆహార భద్రత చట్టం, పంటలకు మద్దతు ధర, ఉపాధి హామీ పథకం దాకా కాంగ్రెస్ పార్టీయే అమల్లోకి తెచ్చిందని సీఎం రేవంత్ చెప్పారు. రైతులు, రైతు కూలీలను దృష్టిలో పెట్టుకుని వాటికి చట్టబద్ధత కల్పించిందన్నారు. అయితే వీటివల్ల రైతుల జీవితాల్లో మార్పులు పూర్తిస్థాయిలో రాలేదని, గత పాలకుల నిర్లక్ష్యం, అకాల వర్షాలు, కరువు ఇందుకు కారణమని అన్నారు. అందుకే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే గత ప్రభుత్వం ఎగ్గొట్టిన 2023 వానాకాలం రైతుబంధు సాయాన్ని తాము అందజేశామని చెప్పారు. 2024 జనవరిలో ప్రారంభించి మార్చి వరకు రూ.7,625 కోట్లను మొదటి విడతగా అందించామన్నారు. ఆ తరువాత ఆగస్టు 15 వరకు రుణమాఫీ చేస్తామని రైతులకు మాట ఇచ్చామని, దాని ప్రకారం 25 రోజుల్లోనే రూ.2 లక్షల వరకు ఉన్న రుణాలను నాలుగు విడతల్లో కలిపి 25,35,964 మంది రైతు కుటుంబాలకు రూ.20,616.89 కోట్ల రుణమాఫీ చేశామని పేర్కొన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఏ రాష్ట్రంలోనూ ఎవరూ ఇప్పటివరకు ఇంత తక్కువ కాలంలో ఇంత పెద్దమొత్తంలో రుణమాఫీ చేయలేదని అన్నారు.

**బీఆర్ఎసకు అర్హత లేదు..**


రికార్డు స్థాయిలో తాము రుణమాఫీ చేసినా.. బీఆర్ఎస్ నాయకులు పదే పదే ఆరోపణలు చేస్తున్నారని రేవంత్ మండిపడ్డారు. గతంలో బీఆర్ఎస్ ఏం చెప్పిందో ఓసారి గుర్తు చేసుకోవాలన్నారు. 2014లో రూ.లక్ష రుణమాఫీ హామీ ఇచ్చి.. నాలుగు విడతల్లో చేస్తామని చెప్పారని, వడ్డీ కూడా చెల్లిస్తామన్నారని గుర్తు చేశారు. మళ్లీ 2018లోనూ రూ.లక్ష రుణాన్ని ఒకేసారి మాఫీ చేస్తామని చెప్పి.. చేయలేదన్నారు. చివరకు 2023 ఎన్నికలు సమీపించే సమయానికి ఔటర్ రింగు రోడ్డును అమ్మి.. హడావిడిగా చేశారని, అది కూడా 21,35,557 మంది రైతులకు రూ.11,909.31 కోట్లను మాత్రమే మాఫీ చేశారని తెలిపారు. నాలుగున్నరేళ్ల తరువాత మాఫీ చేయడం ద్వారా రూ.లక్ష రుణం ఉన్నవారికి వడ్డీకే రూ.8,578.97 కోట్లు చెల్లించాల్సి వచ్చిందన్నారు.

# కనీసం ముగ్గురిని కనండి

**జనాభా క్షీణిస్తే సమాజమే అంతరిస్తుంది!**

**భాషలు, సంస్కృతి కూడా కనుమరుగవుతాయి**

**ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ వ్యాఖ్యలు**



**నాగపూర్, డిసెంబరు 1:** ప్రతి భారతీయ కుటుంబం కనీసం ముగ్గురేసి పిల్లలను కనాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భాగవత్ పిలుపిచ్చారు. జనసంఖ్య క్షీణిస్తే సమాజమే అంతరిస్తుందని హెచ్చరించారు. ఆయన ఆదివారమిక్కడ నాగపూర్‌లో నిర్వహించిన 'కథాలే కుల్ సమ్మేళన్'లో ఆయన ప్రసంగించారు. ప్రస్తుత జనాభా విధానం పాతికేళ్లనాటిదని.. 1998లో లేదా 2002లో ఖరారు చేశారని.. జన సంఖ్య వృద్ధి రేటు 2.1కి తగ్గకూడదని అందులో స్పష్టం చేశారని గుర్తుచేశారు. 'కుటుంబం సమాజంలో భాగం. ప్రతి కుటుంబం ఓ యూనిట్. జనాభా తగ్గుదల ఆందోళన కలిగించే అంశం. వృద్ధి రేటు 2.1కి తక్కువగా ఉంటే. సమాజం అంతరించిపోతుంది. ఆ పరిస్థితుల్లో దానినెవరూ నాశనం చేయనక్కర్లేదు. తనంత తానే నాశనమవుతుంది. భాషలూ కనుమరుగవుతాయి. సంస్కృతీ నశిస్తుంది. ప్రతి జంటా ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలను.. కనీసం ముగ్గురిని కనాలి. ఈ విషయాన్ని జనసంఖ్య శాస్త్రమే చెబుతోంది. సమాజం మనుగడ సాగించాలంటే పిల్లల సంఖ్య ముఖ్యం' అని భాగవత్ పేర్కొన్నారు. జనాభా నియంత్రణ, మతపరమైన జనాభా.. ఈ రెండు అంశాలూ విస్మరించడానికి వీల్లేనివని చెప్పారు. గతంలో నాగపూర్‌లోనే జరిగిన దసరా ర్యాలీలో కూడా ఆయన జనాభా పెరుగుదల అవసరాన్ని నొక్కిచెప్పారు. ప్రతి కోణంలో ఆలోచించి అన్ని వర్గాలకు వర్తించేలా నూతన జనాభా విధానాన్ని రూపొందించాలని ఆ సందర్భంగా అన్నారు. వివిధ వర్గాల జనాభాలో అసమతుల్యం.. భౌగోళిక సరిహద్దులనూ ప్రభావితం చేస్తుందని తెలిపారు. 'జనాభా అత్యధికంగా ఉంటే భారం ఎక్కువగా ఉంటుందన్నది నిజమే. కానీ జనాభాను సక్రమంగా వినియోగించుకుంటే అదో వనరుగా మారుతుంది. 50 ఏళ్ల తర్వాత మన దేశం ఎంత మందికి ఆహారం అందించగలు గుతుందనేది కూడా పరిగణనలోకి తీసుకోవాలి' అని భాగవత్ అభిప్రాయపడ్డారు. మహిళను తల్లిగా పరిగణించడం మంచిదేనని.. అయితే వారిని ఇళ్లలో నాలుగు గోడలకే పరిమితం చేయడం మంచిది కాదని చెప్పారు. భాగవత్ వ్యాఖ్యలపై ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ స్పందిస్తూ.. ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించారు. 'ముస్లిం మహిళలు ఎక్కువ మంది పిల్లలను కంటున్నారని ఆయన గతంలో అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తల్లులు, కుమార్తెల నుంచి బంగారం, మంగళసూత్రాలు లాక్కుని ముస్లింలకు పంచుతారని ప్రచారం చేశారు. ఇప్పుడు భాగవత్ ఎక్కువ మంది పిల్లల్ని కనాలంటు న్నారు. ఇక ఆర్ఎసఎసవాళ్లు పెళ్లిళ్లు చేసుకో వడం మొదలుపెట్టండి' అని అన్నారు. 1960-2000 మధ్య ప్రపంచ జనాభా రెట్టింపైంది. ఆ తర్వాత నుంచి తగ్గుముఖం పడుతూ వస్తోందని పలు అధ్యయన నివేదికలు చెబుతున్నాయి. జనాభా భర్తీ రేటు 2.1కి సమీపంలో ఉన్న దేశాల్లో భారత్, అర్జెంటీనా, ట్యునీసియా.. 2.1 కంటే తక్కువ రేటు ఉన్న దేశాల్లో అమెరికా, మెక్సికో, బ్రెజిల్ ఉన్నాయి. చైనా, జపాన్, దక్షిణ కొరియాల్లో ఇంకా బాగా తక్కువగా ఉండడమే గాక వృద్ధుల జనాభా పెరిగిపోతోంది. భారత్‌లోని పలు రాష్ట్రాలకు కూడా ఆ ముప్పు పొంచి ఉండడంతో.. పిల్లలను ఎక్కువగా కనాలని ఏపీ సీఎం చంద్రబాబు ఇటీవల పదే పదే చెబుతున్నారు.

# ములుగులో భారీ ఎన్‌కౌంటర్




**తొలి సమయం, ములుగు** ఏటూరు నాగారం అడవుల్లో ఆదివారం తెల్లవారుజామున జరిగిన భారీ ఎన్‌కౌంటర్ లో ఏడుగురు మావోయిస్టులు మృతి ( చెందారు. ఏటూరునాగారం ఆస్పత్రిలో భద్రపరిచిన మావోయిస్టుల మృత దేహాలకు సోమవారం అధికారులు పోస్ట్ మార్టం నిర్వహించనున్నారు. ఇందుకోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే నాలుగు మృతదేహాలను గుర్తించారు. మరో మూడు మృతదేహాలను పోలీసులు గుర్తించాల్సి ఉంది. పోస్ట్ మార్టం అనంతరం మృతదేహాలను బంధు వులకు అప్పగిస్తారు. ఎన్ కౌంటర్ బూటకమన్న ఆరోపణల నేపథ్యంలో పోస్ట్ మార్టం నివేదిక కీలకంకానుంది. ములుగు ఏజన్సీలో టెన్షన్ వాతావరణం నెలకొంది. ఒకవైపు మావోయిస్టుల ఎన్‌కౌంటర్.. మరోవైపు సోమవారం నుంచి మావోయిస్టుల పీఎల్‌జీఏ వారోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తం అయ్యారు. ముమ్మరంగా కూంబింగ్ చేపట్టారు. మావోయిస్టుల ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి పనులను నిలిపివేశారు. హిట్‌లిస్టులో ఉన్న వారికి హెచ్చరికలు జారీ చేశారు. హిట్ లిస్టులో ఉన్న నేతలు అనుమతి లేనిదే అడవుల్లోకి రావొద్దన్న పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. మరోవైపు 24 వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించాలని మావోయిస్టు పార్టీ పిలుపు ఇచ్చింది. దీంతో తెలంగాణ, ఛత్తీస్ గడ్ సరిహద్దు వార్ జోన్‌గా మారింది. భద్రాద్రి ఏజెన్సీ నివురు గప్పిన నిప్పులా ఉంది. భద్రతా బలగాలు అడవిని జల్లెడ పడుతున్నాయి. మావోయిస్టులు సంచళనాల కోసం దాడులకు పాల్పడే అవకాశం ఉందని నిఘా వర్గాల సమాచారం.. ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా గెరిల్లా యుద్ధం చేయాలని మావోయిస్ట్ పార్టీ పిలుపు ఇచ్చింది. ఇంకోవైపు 2026 మార్చి 31 నాటికి దేశంలో మావోయిస్ట్ పార్టీ లేకుండా చేస్తామని కేంద్ర హెూం మంత్రి అమిత్ షా డెడ్ లైన్ పెట్టిన విషయం తెలిసిందే. కాగా ములుగు జిల్లా ఏటూరు నాగారం అడవుల్లో మరోమారు తుపాకీ గర్జించింది. ఆదివారం తెల్లవారుజామున జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మృతిచెందారు. పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ(పీఎల్‌జీఏ) వారోత్సవాలకు ఒకరోజు ముందు మావోయిస్టులకు కోలుకోలేని ఎదురుదెబ్బ తగిలింది. మృతుల్లో ఓ మహిళ సహా.. నర్సంపేట-ఇల్లందు ఏరియా కమిటీ కార్యదర్శి కుర్సం మంగు అలియాస్ భద్రు, ఏటూరునాగారం-మహాదేవ్‌పూర్ డివిజన్ కమిటీ కార్యదర్శి ఈగోలపు మల్లయ్య అలియాస్ మధు ఉన్నారు. వీరిలో మధు స్వస్థలం పెద్దపల్లి జిల్లా రాణాపూర్ కాగా.. మిగతా ఆరుగురు ఛత్తీసగఢ్ వారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. పీఎల్‌జీఏ వారోత్సవాల నేపథ్యంలో ఛత్తీసగఢ్-తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన ములుగు జిల్లా వాజేడు, వెంకటాపురం, ఏటూరునాగారం అభయారణ్యాన్ని గ్రేహౌండ్స్, స్పెషల్‌పార్టీ పోలీసులు జల్లెడ పడుతున్నారు. ఈ క్రమంలో.. ఆదివారం ఉదయం 6.16 గంటల సమయంలో ఏటూరు నాగారం మండలం చెల్పాక-ఐలాపూర్ అభయారణ్యంలోని పోలకమ్మవాగు సమీపంలో నక్సల్స్ ఉన్నట్లు గుర్తించారు. ఇరువైపులా అరగంట పాటు కాల్పులు జరిగాయి. మావోయిస్టుల వైపు కాల్పులు ఆగిపోయిన కాసేపటికి.. పోలీసులు ఏడు మృతదేహాలను గుర్తించారు. మృతుల్లో భద్రు, మధుతోపాటు.. ఏరియా కమిటీ సభ్యులు ముస్సాకి దేవల్ అలియాస్ కర్ణాకర్, ముస్సాకి జమునలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మిగతా ముగ్గురిని దళసభ్యులు జైసింగ్, కిశోర్, కామేశ్‌గా భావిస్తున్నారు. ఘటనాస్థలిలో రెండు ఏకే-47 తుపాకులు, జీత్రీ, 303-రైఫిల్, ఇన్సాస్ తుపాకీ, ఎస్‌బీబీఎల్ గన్, సింగిల్‌షాట్ తుపాకీ, తపంచా, కిట్‌బ్యాగులు, విప్లవ సాహిత్యం, వంట సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఏటూరునాగారం, మంగపేట తహసీల్దార్‌లు శవపంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పలువురు మావోయిస్టులు తప్పించుకొని పారిపోయినట్లు భావిస్తున్న పోలీసులు.. కూంబింగ్‌ను ముమ్మరం చేశారు. జిల్లా ఎస్పీ శబరీశ్ సంఘటనాస్థలాన్ని సందర్శించారు. ఎస్పీ మీడియా ప్రతినిధులతో మాట్లా డుతుండగానే.. ఉదయం 11.47గంటలకు ఒకసారి, 11.49గంటలకు మరోసారి రెండేసి రౌండ్లు, మధ్యాహ్నం 12.14 గంటలకు మూడురౌండ్ల కాల్పులు జరిగాయి.

# ఎందుకీ విజయోత్సవాలు?

**- ఏడాదిలో ఒక్క హామీనైనా నెరవేర్చారా..? - సర్కార్‌పై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం**



**తొలి సమయం, హైదరాబాద్, డిసెంబరు 1:** ఏడాది పాలనలో ఏ ఒక్క హామీనీ నెరవేర్చకుండా.. రూ.కోట్లు వెచ్చించి ఎందుకీ విజయోత్సవాలు..? అని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి.. సీఎం రేవంత్‌రెడ్డిని నిలదీశారు. 'మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి..' అని ప్రజలతో ఓట్లు వేయించుకున్న కాంగ్రెసతో, ఏ మార్పూ సాధ్యం కాదని ఏడాదిలోనే తేలిపోయిందని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనకు, ఏడాది కాంగ్రెస్ పాలనకు ఏమాత్రం తేడాలేదని స్పష్టం చేశారు. ఆదివారం కత్రియా హెూటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ.. కిషన్‌రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు, ఏడాది పాలనా వైఫల్యాలపై చార్జ్‌షీట్ విడుదల చేశారు. అనంతరం కాంగ్రెస్ ఏడాది పాలనలో వైఫల్యాలను ఎండగడుతూ కిషన్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. "ఏడాది పాలనలో ఆర్థిక వ్యవస్థ దివాలా తీసింది. ఒక్క ప్రాజెక్టు కూడా కట్టకుండానే సర్కారు ఆర్‌బీఐ నుంచి 9 నెలల్లో రూ.46 వేల కోట్లు అప్పు తీసుకుంది. చేయూత కింద రూ.4వేల పింఛన్ ఇస్తామన్నారు. దాని సంగతేమోగానీ ఉన్న రూ.2వేల పింఛన్ కూడా సక్రమంగా ఇవ్వడం లేదు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అని చెప్పి, ఉన్న బస్సులను రద్దుచేశారు. మహాలక్ష్మి పథకం కింద ప్రతి నెలా ఒక్కో మహిళకు రూ.2,500 చొప్పున ఇప్పటి వరకు రూ.27,500 బాకీ పడ్డారు. పుట్టిన ఆడబిడ్డలకు బంగారు లక్ష్మి పథకం అమలు చేస్తామని చెప్పి, ఇప్పటికీ ఇవ్వలేదు. బీసీ సంక్షేమానికి ఏటా రూ.20వేల కోట్లు కేటాయిస్తామని ఇచ్చిన హామీ ఏమైంది. గురుకుల విద్యార్థులకు మంచి భోజనం కూడా పెట్టలేని దుస్థితి నెలకొంది. విద్యా భరోసా కింద రూ.5 లక్షల బ్యాంకు గ్యారెంటీ కార్డు ఇస్తామన్న హామీ ఎందుకు అమలుచేయలేదు..? పది పంటలకు బోనస్ ఇస్తామని రాహుల్, రేవంత్ గొప్పగా ప్రకటించారు. ఇప్పుడు వరి పంటకు మాత్రమే, అది కూడా సన్న వడ్లకే అంటున్నారు. భూ కబ్జాలు చేసిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకుంటామని ఎన్నికల ముందు చెప్పిన రేవంత్.. వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదు. భూ దందా కోసమే మూసీ పునరుజ్జీవం చేపట్టారు. పేదల ఇళ్లు కూల్చకుండా కూడా మూసీ పునరుజ్జీవం చేపట్టవచ్చు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలుకు సంబంధించి ఆర్థిక వనరుల సమీకరణపై కాంగ్రెసకు రూట్‌మ్యాప్ లేదు" అని కిషన్‌రెడ్డి విమర్శించారు. హామీల అమలుపై ప్రశ్నిస్తే, వ్యక్తిగత విమర్శలు చేయడం సీఎం రేవంత్‌కు అలవాటైపోయిందని మండిపడ్డారు. భాష సరిగా ఉంటే.. రుణమాఫీపై చర్చకు తాను సిద్ధమని రేవంత్‌కు సవాల్ విసిరారు. ఏం సాధించారని విజయోత్సవాలు జరుపుకుంటున్నారని ఎంపీడీకే అరుణకాంగ్రెసపై మండిపడ్డారు.

**చార్జ్‌షీట్‌లోని ప్రధానాంశాలు..**

"కాళేశ్వరం పేరుతో అప్పుడు లక్ష కోట్ల దోపిడీ.. ఇప్పుడు మూసీ పేరుతో లక్షన్నర కోట్లకు ఎసరు. అప్పుడు పదేళ్లపాటు కే టాక్సు.. ఇప్పుడు అన్నింటా ఆర్ఆర్ టాక్సు. పేదలకు అందని ఉచిత వైద్య ఫలాలు.. మార్పు రాలే.. బతుకు మారలే" అంటూ కాంగ్రెస్ వైఫల్యాలను బీజేపీ తన చార్జ్‌షీట్‌లో ఎండగట్టింది. ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, నగేశ్, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ పాల్వాయి హరీశ్ బాబు, కె. వెంకటరమణారెడ్డితో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**రైతు పండుగలు రైతులు చేసుకోవాలి: కొండా**

వికారాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రైతు పండుగలను రైతులు చేసుకోవాలని, రాజకీయ పార్టీలు కాదని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విమర్శించారు. ఈ రోజు తెలంగాణ రైతాంగం బతికి ఉందంటే అది బీజేపీ చలవే అన్నారు. ధాన్యానికి మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ పాలనకు వ్యతిరేకంగా బీజేపీ చేపడుతున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం వికారాబాద్‌లో బైక్ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ యాత్రను ఎన్టీఆర్ చౌరస్తాలో ఎంపీ జెండా ఊపి ప్రారంభించారు.

# దేశం కోసమే మా పోరాటం

**హక్కులను కేంద్రం కాలరాస్తోంది**

**విమర్శలు గుప్పించిన ప్రియాంక**

**వయనాడ్, బెంగళూరు డిసెంబరు 1:** దేశం కోసమే తాము పోరాడుతున్నామని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, వయనాడ్ ఎంపీ ప్రియాంకాగాంధీ అన్నారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రజల హక్కులను కాలరాస్తోందని, కొద్దిమంది తమ వ్యాపార మిత్రులకు సంపదను దోచిపెడుతోందని విమర్శలు గుప్పించారు. వయనాడ్‌లో ఈ ఏడాది జూలై 30న సంభవించిన వరదలకు ఇక్కడి ప్రజలు సర్వస్వం కోల్పోయారని, వారిని ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని దుయ్యబట్టారు. వయనాడు పార్లమెంటు పరిధిలోని మనంతవాదీలో నిర్వహించిన సమావేశంలో ఆదివారం ప్రియాంకాగాంధీ ప్రసంగించారు. "ఏ వ్యవస్థలపై ఈ దేశ నిర్మాణం జరిగిందో ఆ వ్యవస్థలను అధికారంలో ఉన్న వారు నాశనం చేస్తున్నారు. అందుకే దేశం కోసం మేం పోరాటం చేస్తున్నాం" అని అన్నారు. వయనాడ్ విపత్తు బాధితులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొండిచేయి చూపాయని దుయ్యబట్టారు. మరోవైపు, కొద్ది మంది కుబేరులే లబ్ధి పొందున్నంత కాలం దేశం ప్రగతి సాధించలేదని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఒకవైపు అభివృద్ధి ఫలాలు కొద్ది మంది కోటీశ్వరులే అందుకుంటూ మరోవైపు ఆర్థిక విపత్తుల కారణంగా రైతులు, కార్మికులు, మధ్యతరగతి ప్రజలు జీవనం కోసం పోరాడుతుంటే అది ప్రగతి అనిపించుకోదని తెలిపారు. జీడీపీ వృద్ధి బాగా తగ్గినట్టు వార్తలు వచ్చిన నేపథ్యంలో ఆదివారం ఆయన ఈ మేరకు ట్వీట్ చేశారు.



# మన వంటగది.. మన బాధ్యత..

- ప్రభుత్వ రంగ ఆయిల్ కంపెనీల వంటల పోటీలు
- గ్యాస్ ప్రమాదాలపై అవగాహన కోసం పోటీలు
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు






**తొలి సమయం హైదరాబాద్ డెస్క్ డిసెంబర్ 1**
మన వంటగది.. మన బాధ్యత నినాదంతో లిక్విడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్ పి జి) వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం రంగ ఆయిల్ కంపనీలు ఐఓసియల్, హెచ్పీసీయల్,బిపిసియల్ దేశవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో వంటల పోటీలకు శ్రీకారం చుట్టాయి. ఇందులో భాగంగా కరీంనగర్ గాయత్రి ఫంక్షన్ హాల్ లో ఆదివారం వంటల పోటీలు నిర్వహించారు.

ఈ సందర్భంగా వంట చేసే సమయంలో గ్యాస్ వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిశుభ్రత,అనే అంశాలను న్యాయనిర్ణేతలు పరిశీలించారు. కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ ఐఓసియల్ కరీంనగర్ విక్రయ అధికారి మిట్ట మహేశ్ మాట్లాడుతూ యల్పీజి వాడకంలో ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా వుండలన్నదే ప్రభుత్వ నినాదమని, అందుకే మన వంటగది మన భాద్యత అనే నినాదంతో దేశ వ్యాప్తంగా ఈ వంటలపోటీలను వివిధ ఆయిల్ కంపనీలు నిర్వహిస్తున్నాయని తెలిపారు.వంటగది భద్రత కొరకు ఐదు సూత్రాలు పాటించాలని, అందులో సిలిండర్ తీసుకునేటప్పుడు ప్రీ డెలివరీ చెక్,స్టౌ ప్లాట్ఫాంపై వుంచడం,వంటపని తరతవా రెగ్యులేటర్ ఆఫ్ చేయడం, లీకేజి జరిగినప్పుడు 1906 టోల్ ప్రీ నంబరుకు ఫిర్యాదు చేయడం, ఎల్లప్పుడూ సురక్ష రబ్బరు ట్యూబ్ వాడడం ముఖ్యాంశాలుగా గుర్తించాలని కోరారు. సీనియర్ యల్పీజి డీలర్ హుజురాబాద్ అంబుజా గ్యాస్ ఏజన్సీస్ అధినేత పి.వి.మదన్ మోహన్ మాట్లాడుతూ యల్పీజి పట్ల కస్టమర్లకు అవగాహన కల్పించేందుకు గత ఎప్రిల్ నుండి బియస్పి ప్రాథమిక భద్రతా తనిఖీల పేర డెలివరీ సిబ్బంది ఎనిమిది అంశాలతో కూడిన ప్రశ్నావళి ద్వారా ఇంటింటికి తిరిగి భద్రతా తనిఖీలు చేపడుతున్నారని తెలిపారు. ఇది పూర్తిగా ఉచితమని చెప్పారు. కస్టమర్లు విధిగా సురక్ష రబ్బరు ట్యూబు మార్చుకోవాలని దాని కాలపరిమితి ఐదు సంవత్సరాలు ఉంటుందన్నారు. 190 రూపాయల విలువచేసే సురక్ష రబ్బర్ ట్యూబు 150 రూపాయలకే వినియోగదారులకు అందిస్తున్నామని తెలిపారు. ప్రశాంత్ ఎంటర్ప్రైజ్ భాగస్వామ్యంలో ప్రభుత్వ రంగ ఆయిల్ కంపనీల పిలుపు మేరకు నిర్వహించిన మన వంటగది మన బాధ్యత కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరైన మహిళలకు అభినందనలు తెలిపారు. తెలంగాణ యల్పీజి డీలర్ల సంఘం ఉపాధ్యక్షుడు హరిక్రిష్ణ మాట్లాడుతూ గ్యాస్ ప్రమాదాలు జరగకుండా కస్టమర్లకు అవగాహన కల్పించే చొరవ డెలివరీ సిబ్బంది తీసుకోవాలని, సిలిండర్ల జారీచేసేప్పుడు ప్రాథమిక డెలివరీ చెక్ నిర్వహించాలని కోరారు. స్థానిక ప్రశాంత్ ఇండేన్ డీలర్ బొమ్మ రాధక్రిష్ణ కార్యక్రమ ప్రాధాన్యత వివరించారు.ఈ కార్యక్రమంలో కళ్యాణి హరికిషన్ నేదునూరి,మునిపల్లి ఫణిత,చైతన్య న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి గ్యాస్ వాడకంలో నియమాలను పాటించిన వారిలో ముగ్గురిని బహుమతులకు ఎంపిక చేశారు. పుష్కరిణి,రమాదేవి,సునీత ఈ పోటీలలో ప్రథమ,ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకున్నారు.పోటీలలో పాల్గొన్న మహిళలకు గ్యాస్ స్టౌలనం ప్రశాంత్ గ్యాస్ ప్రోత్సాహకంగా అందించింది. సీనియర్ డీలర్లు దీన్ దయల్,రాజిరెడ్డి,అంజయ్య,జగన్ రాము, మల్లేశం,సర్దార్ సింగ్ రాజు,సమ్మక్క,సీనియర్ కస్టమర్ రమేశ్, స్టాఫ్ పవన్,దేవేందర్,సాయి,మనోజ్ ప్రభు, శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాథమిక భద్రతా తనిఖీలు ఎక్కువగా నిర్వహించిన డెలివరీ సిబ్బందికి మెమొంటోలు అందచేశారు.

## ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్న డిసిసిబి డైరెక్టర్

# మేకల మల్లిబాబు యాదవ్



**తొలి సమయం ఇల్లందు డిసెంబర్ 01 :**
కామేపల్లి మండలం పండితాపురం గ్రామంలో అయ్యప్ప స్వాముల ఇరుముడి కార్యక్రమం స్థానిక రామాలయం లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్ ఇరుముడి కార్యక్రమం సందర్భంగా జరిగిన అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లి బాబు యాదవ్ మాట్లాడుతూ గత 40 రోజుల నుండి ఎంతో నిష్టతో, కఠినమైన నియమాలతో దీక్ష చేపట్టి ఇరుముడి కట్టుకున్న బానోత్ వీరన్న గురుస్వామి, జక్కంపూడి ఉపేందర్ గురు స్వామి బాదావత్ నాగరాజ్ స్వామి, భూక్య రవి స్వామి మరియు దాదాపు 40 మంది అయ్యప్ప స్వాముల శబరి యాత్ర ప్రశాంతంగా జరగాలని, కోరుకుంటున్నట్లుగా తెలిపారు. తమిళనాడులో కురుస్తున్న భారీ వర్షాలను జాగ్రత్తగా గమనించి, అందరూ ఎట్టి పరిస్థితులలో కూడా అందరూఒకే చోట ఉండేటట్లుగా కలిసికట్టుగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో భానోత్ నరసింహా నాయక్, మేకల మల్లికార్జున రావు, గుంటుపల్లి వెంకట్రావు, శీలం పుల్లయ్య భూక్య నాగేంద్రబాబు, పాటిబండ్ల ప్రసాదు, దిండిగల శబరి నాథ్, అల్లిక బక్కయ్య గుగులోత్ కిషన్, మొగిలి ముత్తిలింగం, తదితరులు పాల్గొన్నారు

## పోటీ పరీక్షలు భవిష్యత్తులో విద్యార్థులకు

# మార్గదర్శకాలుగా నిలుస్తాయి

**-ఎంఈవో లింగాల కుమారస్వామి**

**తొలి సమయం భూపాలపల్లి డిసెంబర్ 1:**
రాష్ట్ర ప్రభుత్వం అతి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన-ప్రజా విజయోత్సవాలు కార్యక్రమంలో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పునరుత్పాదక శక్తి వనరులు అనే అంశంపై విద్యార్థినీ, విద్యార్థులకు మండల స్థాయి వ్యాసరచన పోటీలను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి ఎంఈవో నల్లాల కుమారస్వామి విద్యార్థినీ, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పోటీ పరీక్షల్లో విద్యార్థినీ, విద్యార్థులు చురుగ్గా పాల్గొని ప్రతిభ కనబరచాలన్నారు. ఈ పోటీ పరీక్షలు భవిష్యత్తులో మార్గదర్శకాలుగా నిలుస్తాయన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు పోటీల్లో పాల్గొనాలనే దృక్పథాన్ని అలవర్చుకుని గెలుపునకు పునాదులు వేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థినీ, విద్యార్థులు సోమవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనాలని సూచించారు. జిల్లా స్థాయిలో పాల్గొన్న విద్యార్థినీ, విద్యార్థులు అత్యున్నత ప్రతిభ కనబరిచి చదువుకున్న పాఠశాలకు, విద్య నేర్పిన గురువులకు, కన్న తల్లిదండ్రులకు, పుట్టిన ఊరికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. అనంతరం వ్యాసరచన పోటీలలో మండల స్థాయిలో ప్రథమ స్థానం పొందిన పట్టెం ధరణిధర్,



ద్వితీయ స్థానం పొందిన బూర అశ్రుత, తృతీయ స్థానం పొందిన బొడ్డు సాయి కిరణ్ లకు బహుబతులను అందించి, వారిని అభినందించి, ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి వెంకన్న, డి చంద్రయ్య, శ్రావణి, ఎం ఆర్ సీ సిబ్బంది చంద్రమౌళి, వేణు, సదయ్య, శివకుమార్, అనిల్ కుమార్, వసంత, రాజయ్య, శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# లింగాల దివ్య మనందరికి ఆదర్శం

**-దివ్యను సత్కరించిన హుమెన్ రైట్స్ అధ్యక్షులు మంగళం పెల్లి**



**తొలి సమయం తొర్రూర్ డిసెంబర్ 1:**
దివ్య ను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలి నేషనల్ హ్యూమన్ రైట్స్ జాతీయ అధ్యక్షుడు మంగళ పెల్లి హుస్సేన్ అన్నారు. ఆదివారం అమ్మపురం గ్రామం మహబూబాబాద్ జిల్లా లింగాల దివ్య,తల్లిదండ్రులు శంకర్, రేణుక,దంపతులకు జన్మించిన దివ్యను నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ ఆఫ్ ఇండియా, జాతీయ అధ్యక్షుడు మంగళ పెల్లి హుస్సేన్,టీం సభ్యులు కలిసి వారి స్వగృహంలో సన్మానించారు.ఈ సందర్భంగా అధ్యక్షులు మంగళ పెల్లి హుస్సేన్ మాట్లాడుతూ, డిఆర్ఎస్ కాలేజీ పత్తేపురంలో డీఈడీ పూర్తి చేసి తర్వాత కోచింగ్ తీసుకొని ఏఆర్ కానిస్టేబుల్ గా 2023 ఎగ్జామినేషన్ లో ఉత్తీర్ణత సాధించింది అన్నారు 2024లో ఫిబ్రవరిలో కానిస్టేబుల్ గా సెలెక్ట్ అవడంతో పాటు ట్రైనింగ్ కూడా కంప్లీట్ చేసుకుని ఉద్యోగాలలో పనిచేస్తున్న దివ్యను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని కొనియాడారు, ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ రాష్ట్ర ట్రెజరర్ శ్రీరామ్ నవీన్, డిస్టిక్ జాయింట్ సెక్రెటరీ ధర్మేశ్వరరావు, ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ వైస్ ప్రెసిడెంట్ శ్వేత, జాయింట్ సెక్రెటరీ మడిపిద్ది సంధ్య,కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు,

# ఆశా వర్కర్ల కు పనికి తగ్గ పారితోషకం వెంటనే ఇవ్వాలి: సీఐటీయూ

**తొలి సమయం ఇల్లందు డిసెంబర్ 1:**
ఇల్లందు ప్రభుత్వం ఆస్పత్రిలో ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు అనంతరం అధికారులకు వినతిపత్రం ఇచ్చారు గత రెండు సంవత్సరాలుగా లిప్రాసి సర్వేకు ఇవ్వకుండా మళ్ళీ ఇప్పుడు సర్వే చేయాలని ఆదేశాలు జారీ చేస్తున్నారని రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ అధికారులకు సర్వే గతంలో చూసిన సర్వే డబ్బులు ఇచ్చేతలే సర్వే చేస్తామని డిసెంబర్ 4 లోపు పెండింగ్ లో ఉన్న ఏరియా స్ వెంటనే చెల్లించాలని చేస్తామని వారు తెలిపారు ప్రభుత్వం పథకాల్లో ఆశా వర్కర్లను పావుల వాడుకుంటూ కనీస వేస్తలం అమలు చేయకపోగా సర్వేల పేరుతో ఇల్లు తిప్పుతూ వాడితో ఇవ్వడం లేదని అనేక మీటింగ్ కూడా




ఇవ్వకుండా తరకర వేతనాలతో జీవిస్తున్నారు ఇబ్బందులు పెడుతున్నారని సిఐటియు జిల్లా నాయకులు అబ్దుల్ నబీ తాళ్లూరి కృష్ణ వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే ఇన్సెంటివ్ డబ్బులు విడుదల చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉమాదేవి,రేణుకా, తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లందు ఏరియా నూతన

# జీఎంగా విసం కృష్ణయ్య



**తొలి సమయం ఇల్లందు డిసెంబర్ 1:**
సింగరేణి ఇల్లందు ఏరియా నూతన జిఎంగా మీసం కృష్ణయ్య ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఉద్యోగులతోపరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జి ఎం బొల్లం వెంకటేశ్వర్లు, జిఎం ఆఫీస్ అధికారులు, గుర్తింపు సంఘం నాయకులు, ప్రాతినిధ్య సంఘం నాయకులు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST:MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101